కలవర పెడుతున్న కరకట్ట ప్రయాణం

- కరకట్ట అభివృద్ధి జరిగేనా..?
- తరచూ చోటు చేసుకుంటున్న ప్రమాదాలు
- ఆందోళనలో ప్రయాణికులు



కొల్లూరు సమీపంలో కరకట్టపై ఓ పక్కకు ఒరిగి ప్రమాద భరితంగా వెళుతున్న ఆర్టీసీ బస్సు

కొల్లూరు: రెండు వాహనాలు ఎదురెదురుగా వస్తే ఒక వాహనం తప్పుకునే వెసులు బాటు లేకుండా ఉన్న కరకట్ట మార్గంలో నాలుగు రోజుల క్రితం కొల్లూరు వద్ద ఆర్టీసీ బస్సు లారీ ఢీ కొన్నాయి. కరకట్టకు ఇరువైపులా ఇరవై అడుగుల లోతు ఉండే ఈ ప్రాంతంలో ఇరు వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా కాపాడగలగడంతో బస్సులోని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

- రెండు రోజుల క్రితం కృష్ణా జిల్లా నుంచి వరిగడ్డితో గుంటూరు జిల్లా వైపు వెళుతున్న ట్రాక్టర్ కొల్లూరు సమీపంలో పశ్చిమ బ్యాంక్ కెనాల్ వైపుకు పల్లపు ప్రాంతంలోకి పల్టీ కొట్టింది. అయితే ట్రాక్టర్‌లో ఉన్న గడ్డి ప్రమాద తీవ్రతను తగ్గించడంతో ట్రాక్టర్‌లో ఉన్న కూలీలు, డ్రైవర్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయట పడ్డారు.
- ఇటీవల లంక గ్రామాలకు చెందిన ద్విచక్ర వాహనదారుడు కరకట్టపై ప్రయాణిస్తూ అధ్వానంగా తయారైన రోడ్డులో ప్రమాదానికి గురయ్యాడు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయే క్రమంలో రోడ్డు అంచులు కోసుకుని పోయి ఉండటంతో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలకు గురై ఆస్పత్రి పాలయ్యాడు.

కరకట్టపై ప్రయాణం ప్రయాణికులను కలవరానికి గురి చేస్తుంది. ఎదురొచ్చే వాహనం నుంచి తప్పుకునే అవకాశం సైతం లేనంత ఇరుకైన రోడ్డు కారణంగా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కరకట్ట అభివృద్ధిలో భాగంగా కొల్లూరు వద్ద రెండు కిలోమీటర్ల మేర కరకట్ట పనులు ఏళ్ల తరబడి నిలిచిపోయి ఉన్నాయి. రైతులు కోర్టును ఆశ్రయించడంతో స్థల సేకరణ నిలిచిపోవడంతో కరకట్ట అభివృద్ధి సాధ్యపడకపోవడంతో ఒకే వాహనం ప్రయాణించే మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. దీనికి తోడు ఇటీవల కరకట్టపై నిర్మించిన బీటీ రోడ్డు అంచులు భారీగా కోతలకు గురవడంతో వాహనదారులు పక్కకు తప్పుకునే అవకాశం కూడా లేకపోవడం ప్రమాదాలకు మూలకారణంగా మారుతుంది. కరకట్టకు రెండు వైపులా సుమారు 20 అడుగుల లోతైన ప్రాంతం ఉండటంతో అధ్వానంగా మారిన కరకట్టపై ఎదురెదురు వాహనాలు తప్పుకునే సమయంలో వాహనాలు ఓ పక్కకు ఒరిగిపోయి ప్రయాణిస్తుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ప్రయాణం సాగిస్తున్నారు. ఇరుకుగా మారిన కరకట్ట వద్ద వాహనచోదకులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా భారీ ప్రమాదాలు చోటు చేసుకొని ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉంది. గతంలో ఈ మార్గంలో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కోకొల్లలు.

దగ్గర మార్గం కావడంతో..

రేపల్లె నుంచి విజయవాడ వెళ్లడానికి కరకట్ట ప్రయాణం దగ్గర మార్గం కావడంతో నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు ప్రయాణిస్తూ ఉంటాయి. రేపల్లె-విజయవాడ ఆర్టీసీ బస్సులు సైతం ఈ మార్గంలోనే రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటే ప్రజల ప్రాణాలకు ముప్పులా మారింది. కొల్లూరు-దోనేపూడి మధ్యలో కరకట్ట ముళ్ల చెట్లతో మూసుకుపోయి ఉండటంతో మలుపుల వద్ద ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధ్వానంగా మారిన కరకట్ట మార్గాన్ని తక్షణం అభివృద్ధి చేసి ప్రమాదాలను నివారించాలని ప్రయాణికులతోపాటు, స్థానికులు కోరుతున్నారు.



కొల్లూరు-ఈపూరు కరకట్ట మార్గంలో గుంతలతో అధ్వానంగా తయారైన రోడ్డు



కొల్లూరు వద్ద అడుగు ఎత్తున అంచులు కోసుకుపోయి ఉన్న కరకట్ట రోడ్డు



దోనేపూడి-కొల్లూరు మధ్య ముళ్ల చెట్లతో మూసుకుపోయిన కరకట్ట మార్గం

క్లుప్తంగా

పూత దశలో సస్యరక్షణ కీలకం

చెరుకుపల్లి: రైతులు మినుము, పెసర పంటల్లో పూత దశలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని గుంటూరు లాంఫాం శాస్త్రవేత్త డి.గోస్వామి రైతులకు సూచించారు. మండలంలోని ఆరుంబాక, కావూరు గ్రామాల్లో అపరాల పంట పొలాలను గురువారం పరిశీలించి వ్యవసాయ అధికారులతో కలిసి రైతులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా పూత దశలో పురుగు పట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

స్పర్శ జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాలు
-జిల్లా లెప్రసీ ఇన్‌చార్జి



బాపట్ల: మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా స్పర్శ జాతీయ కుష్ఠు నిర్మూలన పక్షోత్సవాలు గురువారం మున్సిపల్ హైస్కూల్‌లో జిల్లా లెప్రసీ ఇన్‌చార్జి డాక్టర్ మహమ్మద్ చేపట్టారు. మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమాజం ఈ వ్యాధి నిర్మూలనకు సహకరించవలసినదిగా కోరారు. జబ్బు లక్షణాలు, సర్వే విధానం ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలన్నారు. ఈ సభలో హెచ్‌ఈఓ లెప్రసీ బి.కృష్ణారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు బి.రాజశ్రీ, బుజ్జి టీచర్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యానికి గురవుతున్న వ్యాధులపై అవగాహన ప్రదర్శన



భట్టిప్రోలు (కొల్లూరు) : సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్న వ్యాధుల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని మలేరియా జిల్లా అధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. గురువారం మండలంలోని వెల్లటూరులో నిర్వహించిన అవగాహనా ప్రదర్శనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోదకాలు, డెంగీ తదితర వ్యాధులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయన్నారు. ఈ వ్యాధులకు చికిత్స అందుతున్నప్పటికీ నిర్మూలన విషయంలో నిర్లక్ష్యం జరుగుతుందన్నారు. భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలో సుమారు 400 నుంచి 500 వరకు బోదకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నారన్నారు. వీటిని అరికట్టడానికి వైద్య, పంచాయతీ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలన్నారు. తొలుత గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రామలక్ష్మి, పద్మజ పాల్గొన్నారు.

మానవ హక్కులను కాపాడుకోవాలి
డిప్యూటీ తహశీల్దారు శివయ్య



అమర్తలూరు(వేమూరు): మానవ హక్కులను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని డిప్యూటీ తహసీల్దారు శివయ్య అన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రు గ్రామంలో మానవ హక్కుల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులపై సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మానవ హక్కుల దినోత్సవం ప్రతి ఒక్కరూ నిర్వహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అమర వైద్యులకు నివాళి



తెనాలి రూరల్: కరోనా సమయంలో డ్యూటీ చేస్తూ ప్రాణాలు అర్పించిన వైద్యులకు క్యాండిల్స్ వెలిగించి ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెనాలి శాఖ సభ్యులు నివాళులర్పించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఐఎంఏ కార్యాలయం వద్ద గురువారం రాత్రి ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ కావూరి అనిల్‌కుమార్, కార్యదర్శి డాక్టర్ మధు ప్రభాకర్, డాక్టర్ ఉప్పల పావని ప్రియాంక, డాక్టర్ దక్షిణామూర్తి, డాక్టర్ కొత్తమాసు శ్యాంప్రసాద్, డాక్టర్ ఆవుల చక్రవర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ గుమ్మడి సాంబశివరావు, డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ పాలడుగు ఉమామహేశ్వరరావు తదితర వైద్యులు పాల్గొన్నారు.

ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం
వ్యక్తిత్వ వికాస నిపుణుడు రఘురాం గురూజీ



రేపల్లె రూరల్: ధ్యానం, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని వ్యక్తిత్వ వికాస నిపుణుడు రఘురాం గురూజీ చెప్పారు. మెడిటేషన్ (ధ్యానం), యోగా అంశాలపై పట్టణంలోని రామకృష్ణ ఇంగ్లీష్ మీడియం హైస్కూలులో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన విద్యార్థులకు పలు అంశాలను తెలిపారు. ధ్యానం, యోగాలతో మానసిక ప్రశాంతతతో పాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచవచ్చన్నారు. విద్యార్థి దశలో యోగాతో పాటు ధ్యానం అలవరుచుకుంటే ఏకాగ్రత మెరుగుపడటంతో పాటు జ్ఞాపక శక్తి పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ విరామ సమయంలో ధ్యానం, యోగా చేయాలని కోరారు. అనంతరం ధ్యానం, యోగా చేసే పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కుర్రా అవర్ణ, డైరెక్టర్ మహేష్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై విద్యార్థినులకు అవగాహన అవసరం

గుంటూరు మెడికల్: సర్వైకల్ క్యాన్సర్ అవగాహన మాసాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక పాత గుంటూరు వీఆర్ హైస్కూల్‌లో బాలాజీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గైనకాలజిస్ట్ డాక్టర్ ఎ.సంధ్యారాణి మాట్లాడుతూ యువతుల్లో ఎక్కువగా సర్వైకల్ క్యాన్సర్ పెరిగిపోతోందని అవగాహనతో కట్టడి చేయవచ్చని చెప్పారు. మహిళలు, బాలికలు వ్యాక్సిన్ వేయించుకోవాలని తెలిపారు.

మహాత్మాగాంధీ సేవలు అజరామరం

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

చెరుకుపల్లి (రేపల్లె రూరల్): అహింస సిద్ధాంతంతో దేశానికి స్వాతంత్య్రం తీసుకువచ్చిన పూజ్య జాతిపిత మహాత్మాగాంధీ సేవలు అజరామరమని, పలువురికి ఆదర్శనీయమని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనేక ఉద్యమాలు నిర్వహించి దేశ స్వాతంత్య్రం కోసం కృషి చేసిన మహాత్మాగాంధీని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. ఆయన శాంతి, అహింస మార్గాలను ప్రపంచ మానవాళి అనుసరించాలని కోరారు. అనంతరం బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డి.వెంకటరామిరెడ్డి, కాశీ ప్రభాకర్, ఈవూరు పాపారావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్

మహాత్ముడికి ఘన నివాళి

భట్టిప్రోలు (కొల్లూరు) : మహాత్మాగాంధీ వర్ధంతిని పురస్కరించుకొని భట్టిప్రోలు పీహెచ్‌సీలో ఘనంగా నివాళులర్పించారు. భట్టిప్రోలు వాసవీ క్లబ్, వాసవీ క్లబ్ కుబేర వనిత శాఖల ఆధ్వర్యంలో మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఐపీసీ కేసీజీఎఫ్ తూనుగుంట్ల శ్రీధర్, సిల్వర్‌స్టార్ కేసీజీఎఫ్ బొలిశెట్టి శ్రీనివాసరావు, జిల్లా అధికారి బూర్లె రాంప్రసాద్, శనగపల్లి శ్రీనివాసరావు, శనగపల్లి రవీంద్ర, వాసవీ క్లబ్, వాసవీ కుబేర వనిత క్లబ్ అధ్యక్ష, సెక్రటరీ, ట్రెజరర్‌లు బూర్లె వెంకట చంద్రశేఖరరావు, కొత్త నాగ వెంకట రవితేజ, విడెల శ్రీనివాసరావు, మద్దుల లక్ష్మీప్రియ, తూనుగుంట్ల బేబిరాణి, మద్దుల వెంకటలక్ష్మి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.



పీహెచ్‌సీలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు తదితరులు

ఘనంగా జాతిపిత వర్ధంతి

నగరం: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని గురువారం ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి ఆర్యవైశ్య సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు వెంకటకృష్ణారావు మాట్లాడుతూ మహాత్మాగాంధీని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గాంధీ చూపిన శాంతి, అహింస మార్గంలో నడవాలన్నారు. కార్యక్రమంలో స్వామి లక్ష్మణరావు, దుంపా తాండవ, బాలగోపాల్, శ్రీకాంత్, మంగయ్య తదితరులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘు నాయకులు

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం

బాపట్ల : గ్రామ సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం సాధ్యమని మహాత్మాగాంధీ కన్న కలలను సాకారం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా మహాత్ముని విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా చల్లా రామయ్య మాట్లాడుతూ నాడు దేశం కోసం తెల్ల దొరలతో శాంతియుతంగా పోరాడి దేశానికి స్వాతంత్య్రం తెచ్చారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధికి సచివాలయ వ్యవస్థతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేశారని గుర్తు చేశారు. నాడు-నేడు పనులతో పాఠశాలలను తీర్చిదిద్దిన జగన్‌మోహన్ రెడ్డి పాలనను రాష్ట్ర ప్రజలు మళ్లీ కోరుకుంటున్నారని చల్లా తెలిపారు. చంద్రబాబు మనస్సు మారి సూపర్ సిక్స్‌ను ప్రజలకు అందించే బుద్ధి కలిగించాలని గాంధీజీని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో వినుకొండ దానియేలు, చల్లా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

గాంధీ బోధనలు నిత్య నూతనమైనవి: తహసీల్దార్



గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న తహసీల్దార్ సలీమా, సిబ్బంది

బాపట్ల: మహాత్మాగాంధీ బోధనలు నిత్య నూతనమైనవని తహసీల్దార్ షేక్ సలీమా పేర్కొన్నారు. గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సలీమా మాట్లాడుతూ గాంధీ బోధనలు నిత్య నూతనమైనవని, సదా ఆచరణీయమైనవని పేర్కొన్నారు. గాంధీజీ కేవలం భారతీయులనే కాక ప్రపంచ వ్యాప్తంగా ఎందరినో ప్రభావితం చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు, సీనియర్ అసిస్టెంట్ సాల్మన్‌రాజు, సిబ్బంది భవాని, గౌరీ సాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉండాలి

వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

రేపల్లె రూరల్: ప్రజలకు, కార్యకర్తలకు అండగా ఉంటూ పార్టీ బలోపేతానికి వైఎస్సార్‌సీపీ శ్రేణులు ముందుకు రావాలని వైఎస్సార్‌సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ చెప్పారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో రేపల్లె పట్టణ ముఖ్య నాయకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యలతో తమ ముందుకు వచ్చే ప్రజలకు అండగా నిలవాలన్నారు. వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన మేలును మరో మారు గుర్తు చేయాలన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గమనిస్తూ ఉండాలని, అధిష్టానం పిలుపు మేరకు అన్ని వేళలా కూటమి ప్రభుత్వం అరాచకాలను ఎండగట్టేందుకు ముందుడాలన్నారు. పార్టీలో కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం కల్పిస్తుందన్న అంశం తెలిసిందేనన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్

వెంకటేశ్వరరావు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిక్కాల మణిలాల్
- అధికారుల వేధింపుల వల్ల వెంకటేశ్వరరావు మృతి

నగరం: మనోవేదనతో మృతి చెందిన సజ్జావారిపాలెం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ పులివర్తి వెంకటేశ్వరరావు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిక్కాల మణిలాల్ డిమాండ్ చేశారు. సజ్జావారిపాలెంలో వెంకటేశ్వరరావు మృతదేహాన్ని మణిలాల్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మణిలాల్ విలేకరులతో మాట్లాడుతూ గత 17 సంవత్సరాల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వరరావును అకారణంగా ఆరు నెలల నుంచి విధులు నిర్వహించకుండా నగరం ఎంపీడీవో, ఉపాధి హామీ సిబ్బంది వేధింపులకు గురిచేయడం హేయమైన చర్య అన్నారు. కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా విధుల్లో చేర్చుకోకుండా కోర్టు ధిక్కరణకు పాల్పడడం ఏంటని ప్రశ్నించారు. రాజకీయ కారణాలతో చిన్న ఉద్యోగులను వేధింపులకు గురి చేసి వారి జీవనోపాధిని దెబ్బతీయడం సమంజసం కాదన్నారు. అధికారుల ఒత్తిడులతో తీవ్ర ఆవేదనకు గురై గుండెపోటుతో మృతి చెందిన వెంకటేశ్వరరావు ఘటనను సుమోటాగా జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని కేసు నమోదు చేయాలన్నారు. వెంకటేశ్వరరావు భార్య నాగమణిని కూడా యానిమేటర్‌గా తొలగించడంతో కుటుంబం గడవని పరిస్థితి నెలకొందన్నారు. వారి కుటుంబ పరిస్థితుల రీత్యా ఒకరికి ఉద్యోగం ఇచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఇంకోల్లు రామకృష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎన్.కోటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు కేవీ లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణ

కోడిపర్రు గ్రామ పార్టీ అధ్యక్షుడిగా చిన్నం సంగీతరావు

కోడిపర్రు(వేమూరు): వైఎస్సార్‌సీపీ కోసం పని చేసిన ప్రతి కార్యకర్తను ఆదుకోవడం జరుగుతుందని పార్టీ అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు అన్నారు. వేమూరు మండలంలోని కోడిపర్రు గ్రామంలో గ్రామ కమిటీ అధ్యక్ష ఎన్నిక గురువారం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడిగా చిన్నం సంగీతరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గ్రామ పార్టీ అధ్యక్షుల నియామకం జరుగుతుందన్నారు. పెరవలిలో దాసరి పోతురాజు, కాకర్లమూడికి బొల్లిముంత శ్రీనివాసరరావు(కెప్టెన్) కుచ్చెళ్లపాడుకి తాడికొండ శ్రీనుబాబు, పెనుమర్రుకు కర్లపూడి ఆనంద్, గుమ్మడి సురేష్(దానియేలు) చదలవాడకు కసుకుర్తి దాసు, వెల్లబాడుకు నన్నిపాగ వందనంలను ఎన్నిక చేయడం జరిగిందన్నారు. జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కోగంటి లవకుమార్, జిల్లా గ్రీవెన్స్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మేరీసుబాబు, శ్రీనివాసరరావు, ప్రతాప్, చింతయ్య, బాబ్జీ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపుకు కృషి చేయాలి

భట్టిప్రోలు (కొల్లూరు) : ప్రజా సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నిస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రానున్న శాసన మండలి ఎన్నికలలో గెలిపించాలని యూటీఎఫ్, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, రైతు, కౌలు, రైతు, చేనేత, కార్మిక సంఘం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం భట్టిప్రోలులోని యూటీఎఫ్ కార్యాలయంలో కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్న కేఎస్ లక్ష్మణరావు గెలుపు కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సంఘాల నేతలు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రస్తుతం ఉన్న రాజకీయ పరిస్థితుల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పాటు పడే పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు గ్రాడ్యుయేట్ ఓటర్లు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాల నాయకులు వి.సురేష్, జి.సుధాకర్, మురుగుడు సత్యనారాయణ, జి.నాగరాజు, పి.మనోజ్ కుమార్, కె.రామస్వామి, యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అల్తాఫ్, నాయకులు ఆలీ, బాజీ, ఏకాంబరాచారి, ఖలీల్ పాల్గొన్నారు.



పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచార కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు


నేడు ఉచిత వైద్య శిబిరం

రేపల్లె రూరల్: పట్టణంలోని మోంట్‌ఫోర్ట్ హైస్కూలులో శుక్రవారం ఉదయం 9 నుంచి ఉచిత వైద్య శిబిరంతో పాటు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్కూల్ ప్రిన్సిపాల్ బ్రదర్ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోంట్‌ఫోర్ట్ వ్యవస్థాపకుడు డె.మోంట్‌ఫోర్ట్ జయంతిని పురస్కరించుకుని సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

కొనసాగుతున్న ప్రత్యేక సదరం క్యాంప్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సదరం క్యాంప్ గురువారం కొనసాగింది. ఉదయం 8.30 గంటలకే వికలాంగులు జిల్లా వైద్యశాలకు చేరుకుని నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాంపు జరిగింది. క్యాంప్‌లో నర్సారావుపేట ప్రభుత్వ వైద్యశాల నుంచి వచ్చిన ఈఎన్‌టీ వైద్యులు డాక్టర్ ఎం చంద్రబాబు, సత్తెనపల్లి నుంచి వచ్చిన డాక్టర్ మాధురిలు, బాపట్ల నుంచి వచ్చిన ఆప్తమాలజీ వైద్యులు డాక్టర్ ఆషాకిరణ్, నరసరావుపేట నుంచి వచ్చిన డాక్టర్ ఎన్ హేమశ్రీలు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి క్యాంప్‌ను పర్యవేక్షించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి



అమర్తలూరు(వేమూరు): విద్యార్థులందరు పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు కష్టపడి చదవాలని బాపట్ల జిల్లా విద్యా శాఖాధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలో రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. విద్యార్థుల రోలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు 45 రోజుల గడువు ఉందని విద్యార్థులు సక్రమంగా చదివి మంచి మార్కులు సాధించాలని తెలిపారు. పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ప్రధానోపాధ్యాయుడు నిరీక్షణరావుకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి, ఆదినారాయణ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.